క్లుప్తంగా

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత



ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న వైద్యురాలు రాధిక

గోపాలపట్నం: ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేయడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లను గోపాలపట్నం రాధికా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రాధిక అందించారు. సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ బస్సుల్లో ఉండే ఫస్ట్ ఎయిడ్ కిట్ల ను పరిశీలించి 134 కిట్లు అందించారన్నారు. దీంతో పాటు కిట్లలో పాడైన, కాలం చెల్లిన మందులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వైద్యురాలు రాధిక మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఈ కిట్లు అందించామన్నారు. కిట్లు అందించిన డాక్టర్ రాధికకు డిపో మేనేజర్ రాజశేఖర్ కృజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ ముత్యాలనాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం గ్రామంలో వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సబ్బవరపు నారాయణమూర్తి మాట్లాడుతూ వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. వృద్ధులు, పాదచారుల దాహార్తిని చలివేంద్రాలు తీరుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు,సచివాలయ కార్యదర్శి రవి, సచివాలయ కన్వీనర్ గొర్లి నాయుడు, వార్డు సభ్యులు జక్కాన శ్రీను, కొల్లి దాసు,ఎస్. శ్రీను,బోకం శ్రీను,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'వెండి అంచులు'



వెండి అంచులు నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వెండి అంచులు నాటకాన్ని ప్రదర్శించా రు. పల్లూరూ శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి గంగోత్రిసాయి దర్శకత్వం వహించగా.. సంగీతం సత్యనారాయణమూర్తి సమకూర్చారు. ఏడు పదుల దాటిన వయసులో పురుషుడు తనకంటే చిన్నది అయిన మహిళను పెళ్లి చేసుకోవచ్చా అనే అంశంపై ప్రదర్శించిన నాటక అందరిని మేల్కొలిపింది.

అనంతరం రెండో నాటకంగా పెందుర్తికి చెందిన శ్రీనటరాజ డ్రమటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనుకోని అతిథి నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా, పిళ్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు. మనిషి బతకడానికి కావల్సింది డబ్బే కాని.. డబ్బే సర్వస్వం కాదనే ఇతి వృత్తంతో సాగిన ఈ నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది.

కార్మిక చట్టాలు నిర్వీర్యం

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ముకాస్తూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ విమర్శించారు. విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 790వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎల్ఎంఎంఎం మరియు ఎస్‌బీఎమ్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పినగాడి రోడ్డు విస్తరణ చారిత్రాత్మకం

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.13.92 కోట్లతో పనులు



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ఎంతో ప్రాముఖ్యత కలిగిన వేపగుంట నుంచి పినగాడి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర ఐటీశాఖమంత్రి గడివాడ అమర్‌నాథ్ అన్నారు. రూ.13.92 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో వేపగుంట జంక్షన్ నుంచి రాంపురం వెళ్లే రహదారి విస్తరణ పనులకు బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐదున్నర మీటర్లు ఉన్న రోడ్డును ఏడు మీటర్లకు విస్తరించనున్నట్టు చెప్పారు.

అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు నేషనల్ హైవే పూర్తికావడంతో మేజర్ జంక్షన్‌లలో తప్ప మధ్యలో ఎక్కడా రోడ్డు దిగడానికి అవకాశం లేదన్నారు. నేషనల్ హైవే నామ్స్ ప్రకారం, అనకాపల్లి జంక్షన్, సబ్బవరం జంక్షన్, పెందుర్తి జంక్షన్‌లో మాత్రమే దిగడానికి అవకాశం ఉందన్నారు.

నగరానికి వెళ్లే వారికి ఉపయుక్తం

జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాలతో పాటు విశాఖ నగరానికి వెళ్లేందుకు వేపగుంట నుంచి పినగాడి రహదారి ఎంతో ప్రాముఖ్యంగా ఉందన్నారు. అటు అర్బన్‌ను, ఇటు రూరల్‌ను కలిపే ప్రధాన రహదారి అని అన్నారు. అలాంటి రహదారిని విస్తరించేందుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నిర్ణయం తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే ఆమోదం తెలిపారన్నారు. నాలుగు నెలల్లో విస్తరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ వేపగుంట నుంచి పినగాడి వెళ్లే మార్గం కేవలం పెందుర్తి నియోజకవర్గానికే కాకుండా కోటపాడు, పాడేరు, చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాలకు వెళ్లేందుకు ముఖద్వారంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి , మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి రోడ్డు విస్తరణ అంశం తీసుకెళ్లడం జరిగిందన్నారు. పదిరోజులు తిరగకుండా పనులు ప్రారంభించడం చాలా సంతోషదాయకం అన్నారు.

కల్వర్టుల విస్తరణ

ప్రస్తుత రోడ్డు మార్గంలో ఉన్న పన్నెండు కల్వర్టులను తొలగించి రోడ్డుకు అనుగుణంగా పెద్ద కల్వర్టులు కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రజలకు భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా మార్గ మధ్యంలో ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్డులు, డ్రైన్ల నిర్మాణం కూడా చేపడతామన్నారు. అలాగే అక్కిరెడ్డిపాలెం నుంచి సాధుమఠం రోడ్డు నేషనల్ హైవే16 పరిధిలో ఉందని, కొత్త లేయర్ వేయడానికి ఈనెల 6న టెండర్లు కూడా పిలిచారన్నారు. తొందరలోనే ఆ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే అనకాపల్లి జంక్షన్ నుంచి శంకరం వరకు ఉన్న రోడ్డుతో పాటు సబ్బవరం, అక్కిరెడ్డిపాలెం రోడ్డు పనులు రూ.16. 32కోట్లతో చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, సీనియర్ నాయకుడు భగవాన్ జయరామ్, 94, 97వవార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, గొర్లె రామునాయుడు, పార్టీ నాయకులు జాబ్‌దాస్, రామరాజు, శ్రీకాంత్,, దాసరి సత్తిబాబు, ఆర్అండ్‌బీ ఏఈ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 96వ వార్డు 514 సచివాలయం పరిధి అంబేడ్కర్‌నగర్, మహాలక్ష్మినగర్‌లో ఎమ్మెల్యే బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రాము నాయుడు, లెక్కల రమేష్, సరగడం నరసింహమూర్తి, లెక్కల వేణు, మెంటి ప్రసాద్, మాధవరావు, వర్క్స్ ఏఈ రాజశేఖర్, ఏఈ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి బీటెక్ విద్యార్థి దుర్మరణం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ప్రమాదం



బీటెక్ విద్యార్థి నాని (ఫైల్)



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మృతిచెందిన నాని

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలంలోని అడ్డసార శివారు మర్రిపాలెం గ్రామానికి చెందిన కూరాకుల చిన్నబ్బాయి చిన్న కుమారుడు నాని(21)తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన అతడు బుధవారం రాత్రి బైక్‌పై తగరపువలసలోని కళాశాలకు తిరిగి వెళ్తున్నాడు. ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలంగా ఢీకోవడంతో హెల్మెట్ నుజ్జు నుజ్జు అయి తలకు తీవ్రగాయాలయ్యాయి .దీనితో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



అంతకాపల్లిలో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి సచివాలయం పరిధిలోని అంతకాపల్లి,రావలమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.రావలమ్మపాలెంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ మాట్లాడారు. ఎన్నికల హామీలు నెరవేర్చి ప్రజల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడుబాబు,ఉప సర్పంచ గొర్లి అప్పారావు,సచివాలయ కన్వీనర్ గొర్లి నాయుడు, వార్డు సభ్యులు గొంప వరలక్ష్మి, జక్కాన శ్రీను, కొల్లి దాసు,సబ్బవరపు శ్రీను పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పీఆర్ కమిషనర్ సూర్యకుమారి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సూర్యకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధ వారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆమెకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో త్రినాథరావు ఆమెకు అందజేశారు.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత

- మూడు మణుగులు అరగదీసేందుకు ఏర్పాట్లు



ఆలయ బేడా మండపంలో సిద్ధం చేసిన శానలు

సింహాచలం : సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలి విడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ట, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా శానలను ఏర్పాటు చేశారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



కొత్తపాలెం సబ్ స్టేషన్ వద్ద బ్రేక్‌ను ఆన్ చేస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

గోపాలపట్నం: వేసవిలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. కొత్తపాలెం యల్లపువానిపాలెం ప్రాంతాల్లో వేసవి ఇబ్బందులు ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తపాలెం సబ్ స్టేషన్‌లో నూతనంగా కొత్త బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీన్ని బుధవారం ఎస్ఈ మహేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికరం ఖరీదు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. దీని వల్ల వేసవిలో విద్యుత్ అదనపు లోడును తట్టుకుని నిరంతరాయంగా విద్యుత్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ఈఈ ఎం. శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా ఆదరణ



రాముడిగారి గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



దిబ్బపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



పాత అడవివరంలో బ్రోచర్ అందజేస్తున్న కొలుసు ఈశ్వరరావు తదితరులు

పరవాడ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య అన్నారు. నాయుడుపాలెం శివారు రాముడిగారి గ్రామంలో బుధవారం నాయకులు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, నాయకులు యమహానాయుడు, కన్నూరు శ్రీను పాల్గొన్నారు. – ముత్యాలమ్మపాలెంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

➡ కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామంలో పార్టీ నాయకులు ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సింహాచలం: జీవిఎంసీ 98వవార్డు పరిధిలోని పాత అడవివరంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు నాయకులతో కలిసి ఇంటింటికీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, ప్రజలు పంచ గ్రామాల భూసమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందని నాయకులను ప్రశ్నించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బంక నర్సినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, లండ రమణ, లండ భాస్కరరావు, బొట్టా శ్రీనివాస్, సంపెంగ శ్రీనివాస్, మజ్జి ధర్మా ,ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

బాబోయ్ ధూళి!



రహదారిపై ఎగసిపడుతున్న బూడిద

- లారీల రాకపోకలతో ఎగసిపడుతున్న బూడిద
- భారీ లారీల రాకపోకలతో ధ్వంసమవుతున్న రోడ్లు
- తరచూ ప్రమాదాలు



రహదారిపై రాలిపోయిన ఫ్లైయాష్ తడి ముద్ద

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నుంచి భారీ వాహనాలతో తరలిస్తున్న బూడిద పరవాడ, సబ్బవరం, పెందుర్తి, అనకాపల్లి మండలాల ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. రోడ్లపై ఎగసిపడుతున్న ఫ్లైయాష్‌తో నరకం చూస్తున్నారు. ఎన్టీపీసీలో పేరుకుపోయిన బూడిదను రహదారుల నిర్మాణంలో ఫిల్లింగ్, ఇటుకల తయారీ పరిశ్రమలకు ఉచితంగా అందిస్తోంది. ఇక్కడ బూడిద చెరువుల వద్ద నిల్వ చేసిన తడి పొడి బూడిదను భారీ వాహనాలతో శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదేవిధంగా అనకాపల్లి, విశాఖ, సబ్బవరం, అచ్యుతాపురం, పరవాడ, యలమంచిలి, పాయకరావుపేట, తుని, రాజమండ్రి తదితర ప్రాంతాల్లోని ఇటుకల పరిశ్రమలకు బూడిదను అధికంగా తరలిస్తున్నారు.

నిబంధనలు గాలికి

అయితే బూడిద తరలింపులో నిబంధనలను గాలికి వదిలేస్తున్న కారణంగా లారీల నుంచి తడి, పొడి బూడిద రోడ్లపై పడిపోతుంది. ఎండకు ఎండిపోయి వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలోబూడిద, ధుమ్ము గాల్లోకి ఎగసిపడుతూ ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతుంది. ఒకేసారి నాలుగైదు భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలను గుర్తించకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ రహదారిలో నరకం

పిట్టవానిపాలెం–లంకెలపాలెం రహదారిలో నిత్యం వేలాది వాహనాలు బూడిదతో రాకపోకలు సాగిస్తున్న క్రమంలో దేశపాత్రునిపాలెం రైల్వే కూడలి వద్ద తరచూ ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బూడిద లారీల రాకపోకలతో ఎన్టీపీసీ కారిడార్, గాజువాక–పరవాడ, వాడచీపురుపల్లి–పరవాడ, గాజువాక–యలమంచిలి, పరవాడ–సబ్బవరం, అనకాపల్లి రహదారులు ధ్వంస మవుతున్నాయి. దీంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బూడిదతో రోడ్లకు ఇరువైపుల ఉన్న పెద్ద పెద్ద భవంతులు నిండిపోయి పాడవుతున్నాయని యజమానులు వాపోతున్నారు. అలాగే రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేస్తూ నెట్టుకొస్తున్న అనేక కుటుంబాలు బూడిద కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే బూడిద లారీల నుంచి ఎగసిపడుతున్న ధుమ్ము ధూళి పీల్చడం వల్ల ముక్కు, గొంతు సమస్యలు, కళ్ల మంటలు, శ్వాసకోశ వ్యాధులు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు పట్టిపీడుస్తున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. లారీలు ,ట్రాక్టర్ల నుంచి ధుమ్ము ఎగరకుండా కనీస చర్యలు పాటించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న బూడిద సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పూజలు

- భద్రాచలం చేరిన బస్సు యాత్ర



భద్రాచలంలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, డ్వాక్రా ఆర్పీలు

సీతంపేట: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. డ్వాక్రా ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడు గుళ్ల నుంచి బస్సులో యాత్రకు బయలుదేరిన విషయం తెలిసిందే. మార్గమధ్యలో అనకాపల్లి నూకాలమ్మ, తలుపులమ్మ లోవలో అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రార్థించారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని సీతమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సీతారాములకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గత నాలుగేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి ప్రయోజనాలు నేరుగా మహిళలకే అందజేస్తున్నారని గుర్తుచేశారు. లంచాలు, అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందజేసి, ప్రజలందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడే మరలా సీఎం కావాలని యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీమవరపు శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్ పాల్గొన్నారు.

ఎత్తు నుంచి జారి పడి వ్యక్తి మృతి

మల్కాపురం: నిర్మాణం జరుగుతున్న ఎత్తయిన ప్రదేశం నుంచి జారి పడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక పరిధి మింది సమీపంలోని గుడివాడ అప్పన్న కాలనీ ప్రాంతంలో బొడ్డేటి కుమార్ (34) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. కుమార్ 20 రోజులుగా తన బంధువైన ఈశ్వరరావు వద్ద షెడ్ కట్టే పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో డాక్‌యార్డ్ సమీపంలోని ధనలక్ష్మి గొడౌన్స్‌లో రేకుల షెడ్ వద్ద బుధవారం మధ్యాహ్నం పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో షెడ్‌పై సిమెంట్ రేకులు బిగించడం కోసం పైకి ఎక్కిన కుమార్ షీట్‌పై కాలు వేయడంతో అదుపు తప్పి, కిందికి జారిపోయాడు. తీవ్రగాయాల పాలైన కుమార్‌ను బంధువుల సాయంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడి బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ లూథర్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు.